సాక్షి
అన్నమయ్య జిల్లా
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

దీపావళి ప్రతి ఇంటా కాంతులు నింపాలి



ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్/రాయచోటి అర్బన్: దీపావళి ప్రతి ఇంటా కొత్త కాంతులు నింపాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు ఆయన పండుగ శుభాకాంక్షలను తెలిపారు. దీపావళి అంటే చీకటిపై కాంతి, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయంగా పేర్కొన్నారు. ఈ పండుగను ప్రజలందరూ ఆనందంగా, జాగ్రత్తగా జరుపుకోవాలని సూచించారు.

'గ్రీవెన్స్' తాత్కాలిక రద్దు

రాయచోటి: ఈనెల 20న నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశారు. రాయచోటి కేంద్రంగా కలెక్టరేట్ , ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం జరగబోయే ఈ కార్యక్రమాన్ని దీపావళి పండుగ నేపథ్యంలో తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆదివారం వేర్వేరుగా అందజేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు రావద్దని ప్రకటనలో పేర్కొన్నారు.

పీబీసీలోకి కృష్ణా జలాలు

బి.కొత్తకోట: మండలంలోని గుండ్లపల్లె వద్ద హంద్రీ–నీవా పుంగనూరు ఉప కాలువ (పీబీసీ)కు గత బుధవారం గండిపడి తెగిపోయిన విషయం తెలిసిందే. దీనికారణంగా నీటి తరలింపు నిలిపివేశారు. కాలువకు మరమ్మతులు పూర్తి చేయడంతో సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి ఆదివారం తెల్లవారుజాము 1.30 గంటలకు కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలుత 200 క్యూసెక్కులు వదిలిన అధికారులు కొన్నిగంటల తర్వాత 275 క్యూసెక్కులకు పెంచారు. గండిపడిన కాలువ మరమ్మతులు పూర్తిచేసినా మళ్లీ అక్కడ గండిపడకుండా ఉండేందుకు అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వెలుగుల రవళి.. దీపావళి

దీపావళి వేడుకలకు జిల్లా ముస్తాబైంది. పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. మార్కెట్లో వివిధ ఆకృతుల్లో దీపాలు, లక్ష్మీదేవి ప్రతిమలు విక్రయిస్తున్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. అయితే దీపావళిని అప్రమత్తంగా జరుపుకోవాలని అప్పుడే ఆనందకాంతులు వెల్లివిరుస్తాయని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు.

- నేడు దీపావళి పండుగ
- చెడుపై మంచి గెలుపునకు చిహ్నంగా సంబరాలు



మదనపల్లెలో బాణాసంచా కొనుగోలు చేస్తున్న కొనుగోలుదారులు

మదనపల్లె సిటీ: దీపావళి అంటే వెలుగుల పండుగ. దీపకాంతులతో ఇంటిని అలంకరించి అందరూ ఆనందంగా జరుపుకునే శుభదినం. చెడుపై మంచి గెలుపునకు ప్రతీకగా.. అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే సిరికాంతుల పండుగ. చీకటిని చీల్చుకుంటూ వెలుతురిని వెతుక్కుంటూ సాగడమే మానవజీవితపు పరమార్థం. అలాంటి విజయపు వెలుగుల్ని ప్రజలందరికీ పంచే వేడుక ఇది. జిల్లాలో సోమవారం దీపావళిని వైభవంగా జరుపుకోనున్నారు. దీపకాంతులతో ఇంటిని అలంకరించి చిన్నా పెద్దా తేడా లేకుండా ఆనందాలతో జరుపుకుంటారు. దీపావళి రోజు తప్పనిసరిగా మహాలక్ష్మి పూజ చేస్తారు. లక్ష్మీపూజ సాయంత్రం 7.08 నిమిషాల నుంచి రాత్రి 8.18 గంటల వరకు చేయవచ్చునని పండితులు చెబుతున్నారు.



- జిల్లా వ్యాప్తంగా పండుగ శోభ సంతరించుకుంది. ఈ నేపథ్యంలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు, వాల్మీకిపురం, రైల్వేకోడూరుతో పాటు మండల కేంద్రాల్లోని దుకాణాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. ప్రత్యేకంగా పండుగ కోసం పూజ సామాగ్రి కొనుగోలు ప్రాంతాలు ఏర్పాటు చేశారు.
- బాణసంచా దుకాణాల్లో విక్రయాలు జోరందుకున్నాయి.
- దీపావళి పండుగను పురస్కరించుకుని పూల మార్కెట్‌లు కిటకిటలాడాయి. మదనపల్లె పట్టణంలో బెంగుళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు, నిమ్మనపల్లె క్రాస్, నీరుగట్టువారిపల్లె ప్రాంతాల్లో అరటి పిలకలు, మామిడి ఆకులు, బూడిద గుమ్మడి కాయల అమ్మకాలు ఊపందుకున్నాయి. పూలహారాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. లక్ష్మిపూజకు వ్యాపార దుకాణాలు, వాహనాలకు లక్ష్మిపూజ చేయడంతో పూలహారాలకు గిరాకీ పెరిగింది. మల్లె పూలు కిలో రూ.1200, చామంతి కిలోరూ.180, బంతి రూ.100 పలికింది.
- హిందూ ధర్మశాస్త్రం ప్రకారం ఇంటిలో దీపకాంతి ఉంటే ఎలాంటి చెడు శక్తులు ప్రవేశించవని నమ్మకం. దీపాలు పెట్టేందుకు మట్టి ప్రమిదల్నే ఉపయోగించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.



మట్టి దీపాలు కొనుగోలుచేస్తున్న మహిళ



పూల దుకాణంలో కొనుగోలుదారులు

జాగ్రత్తలు తప్పనిసరి



- లైసెన్స్ ఉన్న దుకాణాల వద్ద బాణాసంచా కొనుగోలు చేయాలి.
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణాసంచా కాల్చాలి
- విద్యుత్ తీగల కింద నిలబడి టపాసులు కాల్చరాదు. కాటన్ దుస్తులను ధరించాలి.
- కాకర పువ్వొత్తులు కాల్చిన వెంటనే వాటిని ఆర్పేందుకు సమీపంలో నీళ్ల డబ్బాలను ఉంచుకోవాలి.
- ఆరుబయట దీపావళి మందులు కాల్చాలి
- ఆస్పత్రుల సమీపంలో, పెట్రోలు బంకులు ఉన్న ప్రాంతాల్లో కాల్చరాదు.
- విధిగా పాదరక్షలు ధరించాలి. అందుబాటులోన నీళ్లు పెట్టుకోవాలి.
- బాణసంచా కాల్చినపుడు గాయాలైతే వెంటనే చల్లని నీరు పోస్తే ఇన్నర్ లేయర్ కాలుద. తర్వాత వైద్యుడిని సంప్రదించాలి.
- పేలని టపాసుల వద్దకు వెళ్లి తొంగి చూడరాదు.
- చేతుల్లో బాంబులు పేల్చడం హానికరం.
- గుడిసెలు ఉన్న ప్రాంతంలో తారాజువ్వలు వేయరాదు
- జేబుల్లో బాణసంచా పెట్టుకోకూడదు
- విద్యుత్ బల్బులు, డెకరేటివ్ బల్బులు అధికంగా పెట్టరాదు. వీటివల్ల షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

సంప్రదాయాలను మరవకూడదు

ఇంటి ముందు దీపకాంతులు దారిద్ర్య నాశనానికి ప్రతీక. శ్రీ మహాలక్ష్మిని అష్టోత్తర శతనామాలతో ఆరాధిస్తే అమ్మవారి అనుగ్రహం అపారంగా ఉంటుంది.మన సంస్కృతి సంప్రదాయాలను మరవకుండా వేడుకలను సమైక్యంగా నిర్వహించుకోవాలి. –డాక్టర్ ఎ.శివకుమార్‌శర్మ, వేదపండితులు, మదనపల్లె

ప్రజాస్వామ్యం.. అపహాస్యం



ప్రభుత్వ వైఫల్యాలు,అవినీతిని నిలదీస్తున్న 'సాక్షి'పై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. 'సాక్షి'ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి విచారణల పేరుతో వేధిస్తోంది. రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని నాయకులు, పాత్రికేయులు, వివిధ వర్గాల నేతలు మండిపడుతున్నారు.

అప్రజాస్వామికం



పత్రికలు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటివి. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారనే కక్షతో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, పాత్రికేయులపై అక్రమకేసులు పెట్టడం అప్రజాస్వామికం. తక్షణమే వీటిని రద్దుచేయాలి.
–రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైస్‌ఎంపీపీ, రైల్వేకోడూరు

బెదిరింపులు మానుకోవాలి



కూటమి ప్రభుత్వం మీడియా పట్ల బెదిరింపు ధోరణి మానుకోవాలి. ప్రభుత్వ అక్రమాలను ప్రజలకు మీడియా ద్వారా చేరవేస్తున్నందుకు కక్షకట్టి సాక్షి ఎడిటర్,పై కేసులు పెట్టడం సరికాదు. భవిష్యత్తు లో మూల్యం చెల్లించుకుంటారు. – శ్రీనివాసులు, సీనియర్ రిపోర్టర్, ఎస్సీ ఫైనాన్స్ కమిషన్ మాజీ డైరెక్టర్

కూటమిది కక్షసాధింపు



ప్రభుత్వ విధానాల్లోని లోపాలను ఎత్తిచూపుతున్న పత్రికలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటు.ఇది వాస్తవాలను సమాధి చేయాలనే దుష్ట పన్నాగం. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమంగా బనాయించిన కేసులను రద్దు చేయాలి.
–చిన్ననాగిరెడ్డి, ఉప సర్పంచ్, చాకిబండ

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు



పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమంటే ప్రజాస్వామ్య స్ఫూర్తికే ప్రమాదం. ఇటువంటి చర్యలను ప్రజలు హర్షించరు. స్రాక్షి కార్యాలయంపై దాడులు, ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం.. పత్రికా స్వేచ్ఛను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వెంటనే మార్చుకోవాలి.
– యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, మండల సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు, సుండుపల్లె

ఎంత కష్టం.. ఎంత నష్టం

- వర్షాలకు దెబ్బతిన్న టమాటా
- నల్లమచ్చలు,గజ్జి రోగాలతో తగ్గిన పంట దిగుబడి
- పలుచోట్ల కాయలు కోయకుండా తోటల్లో వదిలేసిన రైతులు



పచ్చి టమాటాలపై నల్లమచ్చలు ఏర్పడిన దృశ్యం



వర్షాల కారణంగా చెర్లోపల్లెలో నల్లమచ్చలు, గజ్జిరోగాల బారిన పడిన టమాటా తోటలు

గుర్రంకొండ: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. వర్షాల కారణంగా నల్లమచ్చలు, గజ్జిరోగాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. ధరలు ఇప్పుడిప్పుడే పుంజుకొంటున్నా రోగాలతో తోటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోయారు. వందక్రేట్ల టమాటా కోతల్లో సుమారు 35 నుంచి50 క్రేట్ల వరకు రోగాలబారిన పడినకాయలే ఉంటున్నాయి. మార్కెట్లో ప్రస్తుతం 25కేజీల టమాటా క్రేట్ ధర రూ. 550 పలుకుతుండగా రోగాల బారిన పడిన టమాటాలను మార్కెట్లో కొనేవారు లేక పలువురు రైతులు కాయలు కోయకుండా తోటలు వదిలేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 7560 ఎకరాల్లో టమాటా పంట దెబ్బతింది.

ధరలు పుంజుకొంటున్నా దిగుబడి ఏది?

ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరలు పుంజుకొంటున్నాయి. వారం రోజుల కిందటవరకు 25కేజీల క్రేట్ ధర రూ. 300 లోపు ఉండగా ప్రస్తుతం రూ.550 వరకు ధరలు పలుకుతున్నాయి. అయితే ధరలు పుంజుకొంటున్నా పంట దిగుబడి మాత్రం రోగాలు, వైరస్‌ల కారణంగా సగానికిపైగా తగ్గిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టమాటాపై ఒకమచ్చ మాత్రమే ఉన్న కాయలు 25కేజీల క్రేట్ ధర కేవలం రూ. 50 నుంచి రూ.80 లోపు మాత్రమే ధరలు పలుకుతున్నాయి. మచ్చల సంఖ్య ఎక్కువగా ఉంటే వ్యాపారులు కొనడానికి నిరాకరిస్తున్నారు. దీంతో చేసేదిలేక రైతులు రొడ్డు పక్కన పారోబోసి వెళ్లిపోతున్నారు.ప్రస్తుతం నల్లమచ్చలు, గజ్జిరోగాలున్న టమాటా తోటల్లో కాయలు ఎకరానికి 240 నుంచి 280 క్రేట్లు వస్తున్నాయి.

సాగు చేసిన పంట ఎకరాల్లో: **18532**

దెబ్బతిన్నపంట ఎకరాల్లో: **7560**

35 నుంచి50 శాతం మేరకు మచ్చలున్న టమాటాలే:

వర్షాల కారణంగా మంచి కాపుమీదున్న టమాటా తోటల్లో 35 నుంచి 50 శాతం మేరకు కాయలు దెబ్బతిన్నాయి. కోత సమయంలో వంద క్రేట్లకు 35 నుంచి 50 క్రేట్లు నల్లమచ్చలున్న టమాటాలే ఉండడం గమనార్హం. వీటిని మామూలు టమాటాల నుంచి వేరు చేసి మార్కెట్‌కు తర లించాలంటే తలప్రాణం తోకకు వస్తోందని రైతులు వాపోతున్నారు. కొన్ని మండలాల్లో 50 శాతం నుంచి 75 శాతం మేరకు నల్లమచ్చలు రావడంతో పంటను కాపాడుకోవడం భారంగా మారింది.

7560 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు:

వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 7560 ఎకరాల్లో టమాటా పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో కాయల రూపురేఖలు మారిపోయాయి. ఓ వైపు నల్లమచ్చలు, మరోవైపు రంధ్రాలున్న కాయలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ రకం కాయలకు మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతో చేసేదిలేక పలువురు రైతులు తోటలవద్దనే పారబోస్తున్నారు. మరికొంతమంది పశుగ్రాసంగా వినియోగిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుచేసినా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోయాం



వర్షాలతో టమాటా పంటకు నల్లమచ్చలు, గజ్జిరోగాలు సోకి తోటలు దెబ్బతిన్నాయి. వైరస్‌లు, రోగాల కారణగా ఎకరం పంటకు సుమారు 800 క్రేట్ల దిగుబడి రాగా ఇందులో సగానికిపైగా అంటే 300నుంచి 400క్రేట్ల వరకు నల్లమచ్చలున్న టమాటాలు వస్తున్నాయి. చెట్టుకాండం నుంచి ఆకులు, కాయలతో సహా నల్లమచ్చలు ఏర్పడ్డాయి. దీంతో తీవ్రంగా నష్టపోయాం. – రెడ్డిమోహన్, గుర్రంకొండ

కొనేవారు లేరు



మార్కెట్లో నల్లమచ్చలు, గజ్జి రోగం సోకిన టమాటాలను కొనేవారు కరువయ్యారు. నాణ్యమైన టమాటాలు ఒక క్రేట్ ధర రూ.550వరకు పలుకుతున్నాయి. అయితే నల్లమచ్చలున్న కాయలు ఒక క్రేట్ ధర రూ.70లోపే ఉంటోంది. దీంతో ఒకక్రేట్‌కు రూ.500 వరకు రైతులు నష్టపోతున్నారు. టమాటా తోటల్లొ రోగాల నివారణ కోసం ఎకరానికి రూ. 60 వేలు వరకు మందుల కొసం ఖర్చు చేయాల్సి వస్తోంది. –మల్లయ్య, మొరంపల్లె



అమ్ముడుబోని టమాటాలను రోడ్డుపక్కన పారబోసిన రైతులు



పొలాల వద్ద పశుగ్రాసంగా మారిన టమాటాలు

ప్రమాదంలో బొమ్మిరెడ్డి చెరువు



కట్టపై తారురోడ్డు పగుళ్లు



కుంగుతున్న కట్టమట్టి

కట్ట బలహీనపడి పగుళ్లు. కుంగుతున్న కట్ట

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలం బండారువారిపల్లె పంచాయతీలోని బొమ్మిరెడ్డిచెరువు ప్రమాదస్థితిలో ఉండటంతో మూడు గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఆదివారం రాత్రి ప్రజలు కట్టపైకి చేరుకుని ఏం జరుగుతుందో అని ఆందోళన చెందారు. దీనికి సంబంధించి వివరాలు. మండలంలోని కనికలతోపు సమీపంలో ముంబై–చెన్నై జాతీయ రహదారిపైనే బొమ్మిరెడ్డి చెరువు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండిపోయి ప్రవహిస్తోంది. రెండురోజులుగా కురిసిన భారీ వర్షానికి హార్సిలీహిల్స్, పక్కనే ఉన్న కొండలు, గుట్టల్లో కురిసిన వర్షంనీళ్లు చెరువులోకి చేరడంతో ప్రమాదకర స్థాయిలో నిండింది. మొరవ వెళ్తున్నప్పటికి నీటి మట్టం తగ్గడం లేదు. ఈ పరిస్థితుల్లో కట్ట బలహీపడింది. కట్టపై పగుళ్లు రావడమే కాకుండా మట్టి కుంగుతోంది. కట్టపైన తారురోడ్డుకు పగుళ్లు వచ్చాయి. దీంతో చెరువుకట్ట ప్రమాదస్థితికి చేరడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దురదృష్టవశాత్తు కట్ట తెగితే..దీనికి సమీపంలోని కనికలతోపు, ఉమాశంకర్‌కాలనీ, తుమ్మనంగుట్ట, మద్దూరివారిపల్లె కాలనీకి ప్రమాదం వాటిల్లుతుంది. ఇళ్లు మునిగిపోయే పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



పెన్నాలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


పెయ్యల నందు మృతదేహం

సిద్దవటం : పెన్నా నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పెయ్యల నందు(36) గ్రామ సమీపంలోని పెన్నా వద్దకు తన పెంపుడు కుక్కతో శనివారం మధ్యాహ్నం వెళ్లారు. నదిలో చేపలు ఎగురుతుండటంతో.. వాటి కోసం కుక్క అందులోకి దూకింది. కుక్కను రక్షించేందుకు పెన్నా నీటిలో దిగి సుడిగుండంలో చిక్కుకొని గల్లంతైన విషయం తెలిసిందే. ఒంటిమిట్ట సీఐ బాబు ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు, కడప రెస్క్యూ టీమ్ వారు శనివారం సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. మరలా ఆదివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా సిద్దవటం మండలం ఎస్.రాజంపేట గ్రామ సమీపంలోని పెన్నా నదిలో నందు మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య పూజ, మూడేళ్ల కుమార్తె ఉంది. భార్య 8 నెలల నిండు గర్భిణి. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఝరికోనలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన అజమతుల్లా

కలకడ : ఝరికోన ప్రాంతంలో ఆహ్లాదంగా గడపడానికి కుటుంబంతో వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు ఝరికోనలో పడి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... సంబేపల్లె మండలం దేవపట్లకు చెందిన అజమతుల్లా(30) తన కుటుంబ సభ్యులతో ఝరిగడ్డ ప్రాంతానికి కుటుంబంతో కలిసి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు జారి కాలువలో పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనానికి సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అజమతుల్లాను కలకడ పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మహల్ సీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు.. అజమతుల్లా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.





సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ కడపలో ప్రముఖ కార్ గ్యారేజ్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (లేడీ) కావలెను. కడప లోకల్ వారికి ప్రాధాన్యత సంప్ర: 8328050062

■ శ్రీ వేన డీలక్స్ డార్మెటరీ A/C నందు రిసెప్షన్, మెయింటెనెన్స్ చేయుటకు ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వాళ్లు కావలెను. భోజనం + వసతి ఫ్రీ. జోయాలుకాస్ జువెలర్స్ పక్కన ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, కడప. 7799387793, 8297649798

■ కస్టమర్లీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ.15 వేలు -40వేలు.ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406

■ AIRTEL BROADBAND INTERNET డిస్ట్రిబ్యూటర్ వద్ద పనిచేయుటకు మార్కెటింగ్ (సేల్స్) & టెక్నికల్ స్కిల్స్ (ఫైబర్ స్ప్లైసింగ్) కలవారు. సంప్ర: 9949922268

■ A1 అంబులెన్సు నందు పనిచేయుటకు డ్రైవర్స్ కావలెను. 1 & 2 సం॥రాలు అనుభవం లైసెన్స్ ఉండవలెను. సంప్ర: 9502096994

■ 19 సం॥ వయస్సు ఉన్న అటెండర్ (బాయ్) కావలెను. సంప్ర: చిరునామా ఏ.వి.ఎస్ చంద్రారెడ్డి, ఎం.ఎస్.సి, ఎం.ఈ.డి., ఏ.ఎం.ఎఫ్.ఐ, FC UTI మ్యూచువల్ ఫండ్స్, UTI ITSL IT PAN CARD 21-10, 1వ ఫ్లోర్, తిరుమల హాస్పిటల్ దగ్గర, LED ప్రక్కన, ఆర్.ఎస్.రోడ్, కడప -516001

■ నంద కీర్తన్ ఆటో ఫైనాన్స్‌లో రికవరీ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత ఇంటర్ లేదా డిగ్రీ ఫైనాన్స్ రంగంలో కనీసం ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి, త్రీ వీలర్, ఫోర్ వీలర్ డ్రైవింగ్ తెలిసిన వారికి అదనపు ప్రాధాన్యత వయస్సు 22 నుండి 30 సంవత్సరాలు, సంప్ర ఫోన్ 9959594942, 9963131849

■ మదనపల్లిలో గోల్డ్ అప్రైజర్ కోర్స్ నేర్పించబడును. నేర్పించుకొన్నవారికి 100 జాబ్ 25 వేలు జీతం Tada ఇవ్వబడును. సంప్ర: 9010597111

■ Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పంపుటకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82478 08801

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ ప్రియులు

కడప సెవెన్‌రోడ్స్ : మహాదాత బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం అందరికీ స్ఫూర్తిదాయకమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కుమ్మరి దస్తగిరి రచించిన బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ కార్యక్రమం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం కడప హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ డొక్కల కరువులో తిండి లేక వేలాది మంది రాయలసీమ ప్రజలు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. అలాంటి సమయంలో బుడ్డా వెంగళరెడ్డి కొన్ని వేల మందికి కొన్ని నెలల పాటు అంబలి పోసి ప్రాణాలు కాపాడారన్నారు. ఆయన దాతృత్వం, సేవల గురించి భావితరాలకు తెలియజెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కడపలో ఆయన విగ్రహ ఏర్పాటుకు అందరూ ముందుకు రావాలని, తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం, ఆయన చరిత్ర గురించి పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలకు ఆయన పేరు పెట్టాలన్నారు. ఇందువల్ల భావి తరాలు ఆయన గురించి తెలుసుకుని స్ఫూర్తి పొందేందుకు వీలుంటుందన్నారు. ఈ విషయాన్ని తాను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

వర్సిటీలు పరిశోధనలు జరపాలి

రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిలతోపాటు ఎందరో మహనీయుల సేవలు, త్యాగాలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు విశ్వవిద్యాలయాలు పరిశోధనలు చేపట్టాలని అన్నారు. వారి జీవితం, సేవల గురించి ప్రభుత్వం కూడా విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నందన, డొక్కల, ధాతు వంటి భయానక కరువుల్లో రాయలసీమ ప్రజలు అనుభవించిన ఆవేదన, కన్నీళ్లు, అవమానాలు లాంటి అంశాల గురించి బ్రిటీషు గెజిటీర్లు, చరిత్ర పుస్తకాల్లో లేవన్నారు. ఆ విషయాలను చరిత్ర పరిశోధకులు వెలుగులోకి తీసుకు రాగలిగితే రాయలసీమ యువత ఈ ప్రాంత అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున ముందుకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

ఘనంగా సన్మానం

పుస్తక రచయిత దస్తగిరి, బుడ్డా వెంగళరెడ్డి ఐదవ తరం వారసులు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కవి కర్నాటి రామకృష్ణారెడ్డి, పుస్తక సమీక్షకులు జీవీ సాయిప్రసాద్, రెడ్డి సేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, యూ ట్యూబర్ దండా ప్రసాద్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, కడప నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు మోపూరి బాలకృష్ణారెడ్డి, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, నగర ప్రముఖులు పోతుల వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మానవత సంస్థ ప్రతినిధులు డాక్టర్ రామాంజులరెడ్డి, ఆచార్య సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన అవసరం


సురక్ష యాప్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్

రాజంపేట : ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ తెలిపారు. రాజంపేటలో పలు మద్యంషాపులను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 122 మద్యంషాపులు, 11 బార్లను క్షుణ్ణంగా తనిఖీలు చేశామన్నారు. ప్రతి షాపులో ప్రభుత్వం సరఫరా చేసిన మద్యం మాత్రమే ఉందన్నారు. నకిలీ మద్యం ఎక్కడా లేదన్నారు. నకిలీ మద్యం అమ్మితే ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా ఇట్టే పసిగట్టవచ్చునన్నారు. ఒక వేళ ఎక్కడైనా మద్యం అమ్మిన బాటిల్ కన్స్యూమర్ పోర్టల్‌లో వివరాలు రాకపోయినా, మద్యం బాటిల్ అనుమానాస్పదంగా ఉన్న వెంటనే స్థానిక ఎక్సైజ్ అధికారులు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (7981216391)ను సంప్రదించాలన్నారు. వాట్సాప్‌లో ఆ బాటిల్ ఫొటో పంపిన తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 1,11,628 మద్యం సీసాలను స్కాన్ చేసి అమ్మడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లిక, ఎస్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, స్కూటర్ ఢీకొని ముగ్గురికి గాయాలు

పీలేరు రూరల్ : ట్రాక్టర్ – స్కూటర్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మొరవ వడ్డిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ పెళ్లికణం గూడెంకు చెందిన పి.జ్యోతి భానుకుమార్ (23), పి.హరీష్ (21), ఎస్.జ్యోతికుమార్ (19) టపాసులు కొనుగోలు చేయడానికి ద్విచక్రవాహనంలో పీలేరుకు బయలుదేరారు. మొరవవడ్డిపల్లె వద్ద స్కూటర్, ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం పీలేరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడికి గాయాలు

గాలివీడు : మండలంలోని నక్కలవాండ్లపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసీఫ్(33) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని నూలివీడు గ్రామం నక్కలవాండ్లపల్లి చెరువు మలుపు వద్ద ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పార్సిల్ కొరియర్ బాయ్ ఆసీఫ్ ఎడమ కాలు విరిగినట్లు సమాచారం. వెంటనే స్థానికుల సమాచారం మేరకు ప్రైవేటు వాహనంలో రాయచోటికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కడప తరలించారని బంధువులు తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


నగిరిమడుగులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం)/కలకడ : పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికే చంద్రబాబు కుట్ర పన్నారని, అందుకే వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. పీలేరు నియోజకవర్గ పరిధిలోని వాల్మీకిపురం మండలం నగిరిమడుగు, కలకడ మండలంలోని కలకడ పంచాయతీ, కోన గ్రామ పంచాయతీలలో ఆదివారం కోటి సంతకాల సేకరణపై రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు మెరుగైన వైద్య సదుపాయాలు, అందరికీ అందుబాటులోకి వైద్య విద్యను తీసుకురావడానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేసి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చారన్నారు. వీటిలో దాదాపు పది కళాశాలలు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వీటికి అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం తలపెట్టారన్నారు.

డైవర్షన్ రాజకీయాలు

కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి వ్యతిరేక సెగలు తగులుతుండటంతో సీఎం చంద్రబాబు రోజుకొక రకం డైవర్షన్ పాలిటిక్స్ తెరపైకి తెస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. జరగని లిక్కర్ స్కామ్‌లో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా జైలులో నిర్బంధించారని గుర్తు చేశారు. ఎంపీ బెయిల్‌పై విడుదలైనా కూడా ఎంపీ, ఆయన కుటుంబ సభ్యులపై కూటమి ప్రభుత్వం ఏదో రకంగా వేధింపులు కొనసాగిస్తుండటం దుర్మార్గపు చర్యలకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమాలు, కుట్రలు, దౌర్జన్యాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలతో సంతకాలు సేకరించారు. వాల్మీకిపురం కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నీళ్ల భాస్కర్, సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, మండల కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్ రజని, ఎంపీటీసీ రెడ్డెప్ప, పీఎస్ వెంకటరమణారెడ్డి, వెంకటరెడ్డి, సురేంద్రరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, రమేష్, విశ్వనాథ, ఈశ్వర్‌రెడ్డి, కలకడ మండలంలో కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, షావత్ అల్లీ ఖాన్, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మిరెడ్డి, రవికుమార్, జిలానీ బాషా, మస్తాన్ అహ్మద్, అంజన్‌కుమార్, జీవి కిశోర్, వెంకట్రమణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అంటే అమరావతి, పోలవరమా?

వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకులు కె.సురేష్‌బాబు


కోటి సంతకాల సేకరణ పత్రాలు అందజేస్తున్న సురేష్‌బాబు, ఆకేపాటి సోదరులు

రాజంపేట రూరల్ : ఏపీ అంటే అమరావతి, పోలవరం అనే విధంగా సీఎం చంద్రబాబు పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకులు కొత్తమద్ది సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ రూరల్ పరిధిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకులు కొత్తమద్ది సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలకు కోటి సంతకాల సేకరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతోపాటు జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న పథకాలన్నింటిని అమలు చేస్తామని కూటమి నాయకులు ప్రజలను మభ్య పెట్టారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం అపసోపాలు పడుతోందని ఎద్దేవా చేశారు. తమ సామాజిక వర్గానికి మేలు చేసేందుకు అమరావతికి వేల కోట్ల నిధులు వెచ్చిస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను అమలు చేయక పోగా.. నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నారని దుయ్యబట్టారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయనీయబోమని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఆశా దీపంగా నిలుస్తున్న మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయటం సరికాదన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి సంతకాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేపటి మన బిడ్డల భవిష్యత్ కోసం మనం వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందిన నాయకుడు బ్రహ్మయ్య



బ్రహ్మయ్య విగ్రహం, ఉద్దండం ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో సర్పంచిగా పని చేసి అక్కడి ప్రజల మన్ననలు పొందిన ఉద్దండం బ్రహ్మయ్య సేవలను రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు నేతలు కొనియాడారు. ఆదివారం తాళ్లపాకలో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఉద్దండం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తాళ్లపాకలో ఏర్పాటు చేసిన మాజీ సర్పంచి ఉద్దండం బ్రహ్మయ్య విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి.. బ్రహ్మయ్య సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్పంచిగా తాళ్లపాక గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంత అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పని చేసిన వ్యక్తి ఉద్దండం బ్రహ్మయ్య అన్నారు. తాళ్లపాకను అభివృద్ధి చేయాలని అనేక మార్లు టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈయనతోపాటు సోదరుడు చొప్పా అనిల్‌రెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం విగ్రహావిష్కరణ సభలో శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, జనసేన నేత అతికారికృష్ణ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు అద్దేపల్లె ప్రతాపరాజు, టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, మోదుగల కళావతమ్మ, ఇంజినీరింగ్ కళాశాల అధినేత పెంచలయ్య, న్యాయవాది సురేష్‌రాజు, అదృష్టదీపుడు, మోహనరావు, గణేషు, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీరమణ, మైనార్టీ నేత గుల్జార్‌బాషా, రాజంపేట టీడీపీ అధ్యక్షుడు మేడికొండు రవికుమార్‌నాయుడు, మాజీ ఎంపీపీ పారా సుబ్బానాయుడు, ప్రముఖ వైద్యుడు సుధాకర్, టీడీపీ నాయకుడు ఇడమడకల కుమార్, తాళ్లపాక గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను ప్రజలకు వివరిద్దాం


బోరెడ్డిగారిపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో జల్లా సుదర్శన్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్‌రెడ్డి

గాలివీడు : కూటమి ప్రభుత్వం కుట్రలను ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బోరెడ్డిపల్లె, నూలివీడు పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రతి ఇంటా తెలియజేసి.. వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని తెలియజేస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన విషయాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. అనంతరం నక్కలవాండ్లపల్లెలో మల్లేశ్వర స్వామి దేవస్థానానికి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృషితో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులకు సంబంధించిన పనులను ఆయన పరిశీలించి ముఖ ద్వారానికి టెంకాయ కొట్టారు. బోరెడ్డిగారిపల్లెలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ కార్యకర్త ఖలందర్‌బాషా ఇంటిలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని కుట్రలను కోటి సంతకాల కార్యక్రమం ద్వారా తిప్పికొట్టాలని సూచించారు. పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంగా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 17 వైద్య కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. వాటిని ప్రైవేటీకరణ చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గడ్డం చంద్రప్రకాశ్‌రెడ్డి, సర్పంచ్ నారాయణ, మాజీ సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, మైనార్టీ అధ్యక్షులు మన్సూర్, నాయకులు మహబూబ్‌బాషా, భానుమూర్తిరెడ్డి, అర్చకులు జల్లా మల్‌రెడ్డి, వల్లపు నాగేష్, రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి అమ్మకంలో తమ్ముడిపై అన్న ఫిర్యాదు

రాయచోటి : కుటుంబ ఆస్తి విక్రయంపై రాష్ట్ర టీడీడీ ఏకిల సంఘం అధ్యక్షుడు కె.నాగేశ్వరనాయుడు(టీడీపీ) పైన ఆయన సోదరుడు కె.రామచంద్రనాయుడు ఫిర్యాదు చేశాడు. కుటుంబం ఆస్తిగా వున్న రైస్ మిల్స్ యంత్రం పరికరాలు కుటుంబ సభ్యులకు తెలియకుండా విక్రయించడం పట్ల సంబేపల్లె పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఈ ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని సంబేపల్లెలో కొన్ని దశాబ్దాలుగా రైస్‌మిల్‌ను అన్నదమ్ములు నడుపుకొంటున్నారు. ఆస్తి పంపకాల విషయంపై అన్నదమ్ముల మధ్య విభేదాలు తలెత్తడంతో కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం కోర్టులో నడుస్తున్న సమయంలో రైస్‌మిల్‌లోని యంత్ర పరికరాలను విక్రయించడం నేరమంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేసి నాగేశ్వర నాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్న రామచంద్ర నాయుడు కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం రామసముద్రం మండలంలో జరిగింది. చెంబకూరుకు చెందిన చాంద్‌బాషా భార్య ఆయేషా(30) కుటుంబ సమస్యలతో ఇంటి వద్దే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐసీయూ విభాగంలో చికిత్సలు అందించారు.

పాము కాటుతో ఆవు మృత్యువాత

గాలివీడు : పాముకాటుతో ఆవు మృత్యువాత పడిన ఘటన వెలిగల్లు గ్రామ పంచాయతీలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంచూరి వెంకట్రామణారెడ్డికి చెందిన ఆవు ఆదివారం పొలం దగ్గర మేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆవు నోటి నుంచి నురగలు కక్కుతూ మృతి చెందింది. మృత్యువాత పడిన ఆవు విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందని, తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థిని దుర్మరణం

పుల్లంపేట : మండల పరిధిలోని రాజుగారిపల్లికి చెందిన విద్యార్థిని మానస(17) విద్యుత్ షాక్‌తో దర్మరణం చెందింది. ఆ బాలిక ఇంటర్మీడియెట్ చదువుతుండేది. ఆదివారం ఇంట్లో స్విచ్ ఆన్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మానస మృతదేహాన్ని మాజీ మండలాధ్యక్షురాలు ముద్దా పెద్ద విజయమ్మ, మండలాధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి, స్థానిక నాయకులు కుమార్‌రెడ్డిలు సందర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మానస మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గంజాయి బ్యాచ్ వీరంగం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణం జగదాంబ సెంటర్‌లోని వినాయక వీధిలో గంజాయి బ్యాచ్ వీరంగం సృష్టిస్తున్నారని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి 9 గంటల దాటితే ఆ తరువాత అర్ధరాత్రి దాటినా సరే.. ఈ బ్యాచ్ చేసే వీరంగం అంతా ఇంతా కాదని వాపోతున్నారు. రోడ్డుపైనే మద్యం తాగడం, సొల్యూషన్, గంజాయి పీల్చడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అంతే కాక మద్యం మత్తులో బైకులపై అధిక సౌండ్‌తో బైక్ రేసులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఆ వీధిలో గొడవలకు పాల్పడటం, ఆ దారిలో వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, అల్లరి చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని, వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ యువకులకు గంజాయి, సొల్యూషన్ వంటివి ఎవరి నుంచి అందుతున్నాయో.. ఎక్కడి నుంచి వస్తున్నాయో పోలీస్ అధికారులు గుర్తించి అరికట్టాలని విన్నవిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన బాలయ్య

కమలాపురం : కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని పందిళ్లపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చాపాడు మండలం నెరవాడకు చెందిన గొర్ల బాలయ్య (50) మృతి చెందాడు. 108 సిబ్బంది సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలయ్య ఎర్రగుంట్లకు వెళ్లి పనులు చూసుకుని తిరిగి కమలాపురం మీదుగా చాపాడుకు వెళ్లేందుకు తిరిగి వస్తున్న నేపథ్యంలో.. పందిళ్లపల్లె వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం ఇతర ఆసుపత్రికి రెఫర్ చేశారు. అయితే ఇతర ఆసుపత్రికి వెళ్తుండగానే మృతి చెందాడు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి, కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. సుముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.